# మా వాడు ★

★ శ్రీ అల్లంరాజు విశ్వనాథం

మావాడో చిత్రకారుడు. పేరు రామం. వాడి చిత్రాల్ని ఎందరెందరో సుప్రసిద్ధులు మెచ్చుకున్నారు. ప్రదర్శనాల్లో ప్రశంసించారు. మనదేశంలోని గొప్ప చిత్రకారుల్లో ఒకనిగా చేర్చుకున్నారు.

చిన్నప్పట్నుంచీ మా రామం తల్లితోటి, తండ్రితోటీ మారామాలు పెడుతూ బళ్ళోకి వెళ్ళక ఇసుకపోగుచేసి కుక్కల్ని, నక్కల్ని చిత్రిస్తూండేవాడు. వాడి instinct ని చూసి మా వూళ్ళోవాళ్ళంతా వీడు రవివర్మ అవగలడని అంటూండేవారు. పలక, పుల్ల, కాగితం, పెన్సలు కనబడితే చాలు వాటిని చేతపట్టి ఎదురుగుండా పోతూన్న జంతువునో, పక్షినో గీస్తూండేవాడు.

చిన్నవయస్సులో అంత అద్భుతంగా చిత్రాల్ని వ్రాస్తూండడం చూసి మేం అంతా ఆశ్చర్యపడేవాళ్ళం. వీడి జీవితం ఉన్నతంగానే గడవగలదనే ఆశ కలుగుతూండేది మాలో.

రామంగాడు చిలకనేసి పలకమీద మేష్టారుకి చూపించాడు. ఆయన 'ఇదేమిట్రా రెండోరెక్క పైకిలేశావ్' అన్నారు. 'ఎగురుతోందండి' అని జవాబిచ్చాడు రామం. మేష్టారు నన్నుపిలచి 'ఏమోయ్ కొన్నాళ్ళలో వీడు ఆంధ్రచిత్రకారుల్ని దాటగల శక్తి సంపాదించగలడు' అని ఓ చిన్న సర్టిఫికేట్ ఇచ్చారు.

మేష్టారు మాట్లకి మేం అంతా ఉబ్బిపోయాం. వాడికి ఈ లైన్‌లో ఇంటరెస్టు ఉందికదా అని గ్రహించి స్కూలుఫైనల్ అయినతర్వాత art ని improve చెయ్యడం మొదలెట్టేడు.

రామం పెద్దవాడవడం, పేరు ప్రఖ్యాతులు సంపాదించడం, పిల్లల్తో కాపురం చెయ్యడం జరుగుతూంది.

ఎటొచ్చీ, వాడు చిత్రరచనలో ఉపయోగించే తెలివితేటల్ని సామాన్య గృహజీవన సందర్భంలో వినియోగించలేడు.

పెళ్ళాం విమల వాడి ideas బట్టి నడుచుకుందాం అని ప్రయత్నిస్తుంది కాని విఫలురాలవుతూంది. ప్రపంచంలో లేని వింతభావాలు రామానివి. ఓ సమయంలో రైటన్నమాట రెండోసమయంలో తప్పంటాడు. నిమిష నిమిషానికి అతని భావాలూ ఆశయాలు పరిణామం చెందుతూంటాయి. ఓపంథ త్రొక్కదామనే దృఢసంకల్పం లేదు. వింతపోకడల్ని తెలుసుకున్న మా బంధువులంతా రామాన్ని హేళనగా చూడ్డం మొదలెట్టేరు. 'ఎంత తెలివితేట్లుంటేం? ఎంత పేరుగడిస్తే ఏం, సంసారిక జీవనంలోని ఆచారవ్యవహారాలు అర్థంచేసుకుని ఆచరణలో పెట్టలేనివాని మొహం చూడ బుద్ధెయ్యదు—' అనే భావం మా బంధుకోటి హృదయాల్లో నాటుకుపోయింది.

ఆఖరికి అత్తగారైనా రావడం మానేశారు. 'ఇంత స్వేచ్ఛైన జీవితం లేదు' అంటాడు ఏ బంధువు రావడం విసర్జించాక. 'బంధువుల్తో నాకు పనిలేదు—వెధవ చుట్టరికం. కాస్త పర్సు బరువుగా ఉంటే కప్పల్లా చేరుతారు—లేకయితే వాసనైనా చూడరు. ఏంతెలుసు వీళ్ళకి. ఒక్క ప్రాణమిత్రుడుంటే చాలు

వెయ్యి బంధువుల పెట్టు. సమయంవస్తే ప్రాణాల్నైనా త్యాగంచేయగల శక్తి స్నేహహృదయంలో ఉంది గాని వీళ్ళలో లేదు ' అంటూ ఆతని మనస్సు ఘోషిస్తూంటుంది.

'పోనీ, బంధువులెందుకు, ఆఖరికి నా పెళ్లామైనా, నా నడవడి కని అర్థంచేసుకుందా?...లేదు... స్త్రీ హృదయాలకంత తెలివితేటలెక్కడున్నాయి?...ఎప్పుడూ తనవారు, తను అంటే అభిమానం. వాళ్లే ప్రపంచంలోని జనాభా—మిగతావాళ్ళతో పనిలేదు. దాని తమ్ముడొస్తే స్వర్గం; లేకపోతే నరకం. వాళ్లకి నాలుగురూపాయలు మనిఆర్డరు చేస్తే సద్వినియోగం చేసినట్టు, లేకపోతే నేనేముండలకో పోస్తున్నట్టు. ఈ స్త్రీ హృదయం తన పురుషహృదయాన్ని ఎన్నటికో గాని అర్థంచేసుకోలేదు. ఇలాంటిది ఉంటేం ఊడితేం? పేరుమాత్రం విమలం. మనస్సు 'సమలం'.

'ఈ విమలతో నాకు సంసారసుఖం లేదు. ఎన్నాళ్లీ కష్టజీవనం భరించడం? ఓనాడు కాకపోతే ఓనాడేనా హృదయానికి ఆనందాన్ని నింపుతూండాలి భార్య అన్నప్పుడు. అబ్బే! సౌఖ్యం అన్నది **nil balance** నా జీవితంలో పౌర్ణమిలు లేవు. ఈ విమల ముఖం అమావాశ్య నిశాధిరేఖలతో నిండిఉంటుంది. ఎంతకాలం నా కళ నా హృదయానికి ఆనందాన్ని చేకూరుస్తూంటుంది? కళ హృదయసంబంధి అయినా ఇంటి నాలుగుగోడలు మధ్యా నా మనస్సుకి పరితాపమే గాని శాంతిలేదు. ఛీ! దీని మొహం చూడకూడదు' అంటూ రామం హృదయం విలపిస్తోంది.

ఆ రాత్రే భారమైన మనస్సుల్తోటి సినీమాచూసి ఇంటికొచ్చి పడుక్కున్నారు రామం భార్యాను.

రామానికి నిద్రపట్టదు. గదంతా తేరిపారచూస్తున్నాడు. నరకలోకంలా కనిపించింది. విమల మొహం నరకలోకంలోని యమదూతలా కనిపించింది. విమల కదిలింది. తన్ని కొట్టడానికి యమదూత కదుల్తున్నాడేమో అనుకుని రామం జంకేడు. విమల దొర్లి దగ్గరకొచ్చింది. విమల శరీరం తాకడంతోటే ముళ్లుగ్రుచ్చినట్టయింది. 'ఛీ! దూరంగా పో' అంటూ రామం మంచం దిగాడు. విమల 'హా' అంటూ ఆవలించింది. 'నేను రాను' అంటూ రామం పరుగెత్తేడు. తలుపులు తెరచే ఉన్నాయి.

మర్నాడు విమల. ఏకాంతంగా ఉండిపోయింది. ఏడీ? రామం?......భగ్నహృదయం—మరణించాడా? పారిపోయాడా?...

'నీతో సుఖించే భాగ్యం నా నుదుట వ్రాయబడిలేదు. నేను బొంబాయిలో నా స్నేహితుడింట జీవిస్తాను. నీకూ నాకూ...ఇంతే...'

అభాగిని. విమల సంసారనౌక సాగడం ఎలాగ? పతి ప్రేమామృతపాత్రని చేతులారా బోర్లపడ త్రోసుకుంది...